www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 15 నవంబర్ 2024

5

చిత్తూరు



ఆక్రమణలు తొలగిస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న సిటి ప్లానర్ నాగేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర పరిధిలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపనున్నట్లు అసిస్టెంట్ సిటి ప్లానర్ నాగేంద్ర స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో గురువారం సర్వేనెంబర్ మాస్టర్ అప్‌డేట్‌పై వీఆర్వోలకు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి నగరంలో రోడ్లుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగింపు, హైరోడ్డు విస్తరణ, ప్రభుత్వ, మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్చించారు.

పశువుల కొట్టం ఆదరువుగా ఉపాధి చట్టం

- మినీ గోకులం షెడ్లు పాడి రైతులకు వరం
- 'ఉపాధి హామీ' ద్వారా నిర్మాణాలు
- జిల్లాలో 2,327 షెడ్లు మంజూరు

ప్రజాశక్తి- యాదమరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం ద్వారా గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం, పశుసంవర్ధక శాఖ సహకారంతో జిల్లాలో గోకులం షెడ్ల నిర్మాణం ప్రక్రియ కొనసాగుతుంది.

చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు 28 మండలాల్లో 2327 మినీ గోకులం షెడ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 615 షెడ్లు నిర్మాణాలు మార్కింగ్ కూడా ఇచ్చారు. 1685 షెడ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. 27 గోకులం షెడ్లు మాత్రమే పూర్తి అయ్యియి. పశువులకు శాశ్వతమైన షెడ్లు నిర్మించాలని ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న రైతులకు మినీ గోకులం షెడ్లు నిరుపేద రైతులకు ఓ సువర్ణ అవకాశం. గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు ఎక్కువ సంఖ్యలో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. పశు పోషణ దానాలు, వరిగడ్డి ధరలు పెరగడం, రైతులకు పాలు గిట్టుబాటు ధర లేకపోవడంతో వచ్చే ఆదాయంతో పశువుల దాన, గడ్డికే వచ్చిన ఆదాయంతో సగానికి పైగా దానికి వెచ్చించాల్సి వస్తుంది. ఇక పశువులకు షెడ్లు నిర్మించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో చాలామంది రైతులు తమకున్న పాడిపశువులను చెట్ల కింద, పశువుల కొట్టం లోను కట్టేస్తున్నారు. షెడ్లు వేసుకోవాలంటే లక్ష రూపాయలు ఖర్చు అవుతుండడంతో పాడిరైతులు షెడ్లు నిర్మించుకోలేకపోతున్నారు. దీంతో పశువులను వర్షాకాలంలో తుడుస్తూ పలు రోగాల భారిన పడుతున్నాయి. ప్రభుత్వం పేద పాడి రైతులకు మినీ షెడ్లు మంజూరు చేయడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..

- వెంకటరమణ, పాడి రైతు, జంగాలపల్లి, యాదమరి

నాకు పది పాడి ఆవులు ఉన్నాయి. నాకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో చాలా కాలంగా వీటిని కొట్టంలేనే కట్టేసేవాళ్ళం. ఎండైనా, వానైనా కొట్టాంలోనే ఉండేవి. గోకులం షెడ్లు మంజూరు కావడంతో ఆవుల కోసం శాశ్వత షెడ్డు ఉంటుంది. ప్రభుత్వం షెడ్లు నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది.

పాడి రైతులకు ఎంతో ఉపయోగం

- వెంకటేష్, పాడి రైతు, జంగాపల్లి, యాదమరి

నేను పశువులను మేపుకుంటూ అందులో వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తూ కుటుంబ పోషణతోపాటు మా పిల్లలను చదివిస్తున్నాను. ఎన్నో ఏళ్లుగా పశువులకు శాశ్వతంగా షెడ్డు వేయాలని అనుకుంటున్నా లక్షకు పైగా ఖర్చు చేసే స్థోమత లేక వేయలేదు. వానాకాలంలో పశువులు చెట్ల కింద వర్షంలోనే కట్టేసే వాడిని. ప్రభుత్వం గోకుల షెడ్డు మంజూరు చేయడంతో పశువులకు ఎండకు, వానకు ఇబ్బంది లేకుండా షెడ్డు నిర్మాణం చేపడుతున్నాను. మాలాంటి పేద పాడి రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

షెడ్ల నిర్మాణం వివరాలు..

షెడ్డు పరిధి	యూనిట్ విలువ	'ఉపాధి' నిధులు	రైతు వాటా
పశువుల షెడ్డుకు			
2 పశువులకు	1,15,000	1,03,500	11,500
4 పశువులకు	1,85,000	1,66,500	18,500
6 కంటే అధికం	2,30,000	2,07,500	23,000
మేకలు, గొర్రెల షెడ్డుకు			
20 గొర్రెలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు	2,30,000	1,61,000	69,000
కోళ్ల షెడ్డుకు			
100 కోళ్లు	87,000	60,000	26,100
200 కోళ్లు	1,32,000	92,000	39,600



గోకులం షెడ్లకు మార్కింగ్ ఇస్తున్న ఉపాధి హామీ అధికారులు

నాణ్యత ప్రమాణాలు పాటించాలి: పీడీ

ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా ఉపాధి హామీ చట్టం సంచాలకులు రవికుమార్ అన్నారు. గురువారం జిల్లా ఉపాధి హామీ సమావేశ మందిరంలో జేఈలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలకు గోకులం షెడ్ల నిర్మాణాల పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టే విధంగా పశుసంవర్ధక శాఖ, పాధి సిబ్బంది సంయుక్తంగా పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పవన్ కళ్యాణ్, ఆదేశాలతో సంక్రాంతి జనవరి 15వ తేదీ లోపు గోకులం షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. గోకులం షెడ్లు నిర్మించేటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన కొలతలతో నిర్మాణాలు మొదలుపెట్టాలని తెలిపారు. గోకులం షెడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఈసీలు, ఏపీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. గతంలో నిర్మించిన షెడ్లకు, పాతవాటికి బిల్లులు చెల్లించరాదన్నారు. చిత్తూరు జిల్లాలో గోకులం షెడ్లు మంజూరై ఇంకా పనులు మొదలుపెట్టిన రైతుల వద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పించి వెంటనే పనులు ప్రారంభించే విధంగా ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు, సర్పంచులు ఎంపీటీసీలు ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ అధికారులు సహకారంతో గోకులం షెడ్లను 100శాతం పనులను పూర్తిచేసే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. గోకుల షెడ్ల ప్రగతిని జిల్లా కలెక్టర్ ప్రతివారం సమీక్ష ఉంటుందని వారం వారం టార్గెట్‌ను ఆయా మండల ఏపీవోలు నివేదికలు జిల్లా కేంద్రానికి అందించాలన్నారు. షెడ్ల నిర్మాణాలు, నాణ్యతలపై నిర్లక్ష్యంగా వ్యవహరించి సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



జిల్లా ఈసీలతో సమావేశమైన పీడీ రవికుమార్

ప్రజా సమస్యలపై ప్రజాపోరు

- అధికారుల దృష్టికి సమస్యలు
- తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలు, వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, బంగారుపాళ్యం :

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం నేతృత్వంలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు ప్రజాపోరు పేరిట జిల్లాలో సిపిఎం నాయకత్వం బృందాలుగా ఏర్పడి పర్యటించాయి. ప్రజాపోరు కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై గురువారం జిల్లాలోని మండల తహశీల్దార్ కార్యాలయాల ముందు నిరసన తెలిపి అనంతరం తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు బంగాపారుపాళ్యం మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని మురికివాడల్లో కనీస మౌలిక వసతులు లేవని, అనేక చోట్ల శ్మశాన స్థలాలు ఆక్రమ గురికావడంతో పాటు రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ఫలితంగా ఎక్కువగా దళిత, గిరిజనల శ్మశాన వాటికలు, అనుభవంలోని భూములను కబ్జాకు గురికావడం జరిగిందన్నారు. బంగారుపాళ్యం మండలంలో చెరువుల సాగునీటి కాల్వలను సైతం అగ్రకుల పెత్తందార్లు ఆక్రమించుకొని ప్రశ్నించిన రైతులపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే గిరిజనులు సాగు చేస్తున్న భూములను అగ్రకులాలు అక్రమ పట్టాలు పొంది గిరిజనులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ సమస్యల జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గిరిజనులు ఏండ్ల తరబడీ పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. సిపిఎం ప్రజాపోరు ప్రజాసమస్యలను బంగారుపాళ్యం, నగరి, గంగవరం, చౌడేపల్లి, నింద్ర, వికోట, పలమనేరు తహశీల్దార్ కార్యాలయాల ముందుకు నిరసనలు వ్యక్తం చేసి అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ కి వినతి పత్రం సమర్పించారు.



బంగారుపాళ్యం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



నగరిలో..

నాయకులు శంకరాచారి, హేమంత్, జయరాంశెట్టి, మంజు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని ఓటి చెరువు ప్రాంతంలోని దళితులు డ్రైనేజీ, మురికి కాలువ సమస్య ఎండ్ల తరబడీ ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు కాలువల్లో పారపోవడంతో నివాసాల మధ్య నిలిచిపోవడంతో కంపుకొడుతోందని వర్షం కురిస్తే మురుగునీరు వర్షపు నీరుతో కలసి ఇండ్లలోకి వస్తోందని, కాలువల్లో మురుగు పారక ఎత్తిపోయాల్సి వస్తోందన్నారు. మురుగునీటి కాలువ లోతు పెంచాలని చిత్తూరు నగర హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌కు సిపిఎ నగర కార్యదర్శి కె.సురేంద్రన్ బాధితులతో కలిసి హెల్త్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.



. హెల్త్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నగర కార్యదర్శి సురేంద్రన్

పలమనేరు: ప్రజాసమస్యలపై అధికారులు తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరుతూ సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజా, జయంతి, హరి, ధనమ్మ, రత్నమ్మ, కైరున్నిషా, శాంతమ్మ, మండల కార్యదర్శి రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



పలమనేరులో..

విజయపురం: ప్రజా సమస్యలపై గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం కార్యదర్శి పెరుమాళ్, నాయకులు సందీప్, తంగరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నగరి మండలంలో పోరంబోకు భూములు అన్యాక్రాంతమయ్యాయని, పేదలు నివసిస్తున్న కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పవర్‌ల్సూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధరణి గ్రామంలో అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకోవాలని, సత్రవాడలో భూముల ఆక్రమణను అడ్డుకోవాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు షణ్ముగం, ఉమాపతి పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



ప్రజాశక్తి- తవణంపల్లి: తవణంపల్లి పోలీసు స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ చండోలు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసరాలు, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అలాగే హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్సను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్‌ను పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, తవణంపల్లి ఎస్ఐ చిరంజీవి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'తగిన జాగ్రత్తలు తీసుకోవాలి'

డిఎం అండ్ హెచ్ఓ ప్రభావతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వ్యాధి నిరోధక టీకాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి ఆదేశించారు. డిఎంఅండ్‌హెచ్ఒ, డిఐఓ డాక్టర్ హనుమంతరావులు గురువారం ఏఈఎఫ్ఐ (అడ్వర్స్ ఈవెంట్స్ ఫాలోయింగ్ ఇమినైజేషన్) జిల్లా కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంటి బిడ్డలకు వేసే వ్యాధినిరోధక టీకాలు, టీకాలు వేసిన తర్వాత వచ్చే సమస్యలు ఏర్పడినా సమాచారం అందించి వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ అపోలో మెడికల్ కాలేజ్ పీడియాట్రిషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రంగనాథ్, పీడియాట్రిషన్ డాక్టర్ లత, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఐడిఎస్‌పి కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్, ఎపిడిమియాలజిస్ట్ శ్రీవాణి, డాక్టర్ శిరీష, డాక్టర్ శివకుమార్ రెడ్డి, డాక్టర్ రంజిత పాల్గొన్నారు.

'విద్యార్థులకు సర్టిఫికెట్ త్వరగా ఇవ్వండి'

ప్రజాశక్తి- పుంగనూరు: సచివాలయాలకు వచ్చే విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ మంజూరులో ఆలస్యం, నిర్లక్ష్యం చేయకుండా త్వరగా ఇవ్వాలని ఛైర్మన్ అలీమ్ బాష సిబ్బందికి సూచించారు. కొత్తపేటలోని 16వ సచివాలయంలో గురువారం ఛైర్మన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని విద్యార్థులకు అవసరమైన జనన ధ్రువపత్రాలు, ఇతర సర్టిఫికెట్లు త్వరగా మంజూరు చేయాలన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

సచివాలయంపై శీతకన్ను

- అర్థాంతరంగా నిలిచిన నిర్మాణాలు
- పూర్తి అయినా ప్రారంభించని వైనం
- ఇరుకు గదుల్లోనే సిబ్బంది ఇక్కట్లు

ప్రజాశక్తి- విజయపురం:

గత ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోంది. ప్రతి సచివాలయ భవనానికి రూ.40లక్షల నిధులు కేటాయించి, నిర్మించిన భవనాలు నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. కొన్ని చోట్ల భవన నిర్మాణ పనులను పూర్తిగా ఆపేశారు. దీంతో సిబ్బందికి ఇరుకు గదుల్లో అవస్థలు తప్పడున్నారు. మరోవైపు రూ.కోట్ల ప్రజాధనం వృథాగా అయ్యింది.



ముందుకు సాగని నిర్మాణాలు..

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా నగరి నియోజకవర్గంలో అన్నిచోట్ల సచివాలయ భవన నిర్మాణాలు ఆగిపోయాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 66 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే వీటన్నింటికి పక్కా భవనాలు మంజూరు చేయడంతోపాటు 44 భవనాలు పూర్తి చేశారు. ఇందులో 29 భవనాలను కూడా ప్రారంభించారు. తర్వాతా ఎన్నికల కోడ్ రావటంతో కొన్నింటిని ప్రారంభించలేదు. మిగిలిన 34 భవనాలు నిర్మాణాలు దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోవటంతో నిర్మాణాలన్ని ఆగిపోయాయి. దీంతో గ్రామాల్లో చాలాచోట్ల మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. విజయపురం, నింద్ర, వడమాలపేట, నగరి, పుత్తూరు మండలాల్లో పలుచోట్ల భవన నిర్మాణాలు పూర్తిచేసినా ప్రజాప్రతినిధులు వాటిని ప్రారంభించకపోవటంతో అధికారులు వాటిని వినియోగించుకోవటం లేదు.

సిబ్బందికి తప్పని ఇక్కట్లు..

నియోజకవర్గంలో గ్రామ సచివాలయ భవనాలు లేకపోవటంతో పాత పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో సచివాలయాలను నిర్వహిస్తున్నారు. 10 మంది పైగా ఉద్యోగులు ఉండే సచివాలయాల్లో ఇరుకుగా ఉన్న గదుల్లో విధులు నిర్వహించాలంటే సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు నాయకులు మండలాల్లో కొన్నిచోట్ల ఈ భవనాలను అధికారులను వినియోగించుకోనీయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నష్టపరిహారం చెల్లించాలి

వ్యకాసం జిల్లా కన్వీనర్ ఓబుల్ రాజు



బాధిత రైతులతో మాట్లాడుతున్న ఓబుల్‌రాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యాదమరి మండల పరిధిలో 400 కేవి విద్యుత్ లైన్ బాధితులకు చట్టపరంగా అందాల్సిన నష్టపరిహారాన్ని చెల్లించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఓబుల్‌రాజు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ రైతులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తే రైతులకు కలుపుకొని పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. యాదమరి మండలం ఎక్స్ప్రెస్ హైవే పక్కన 400 కేవి విద్యుత్ లైన్ వల్ల భూములు కోల్పోతున్న ప్రాంతాన్ని గురువారం ఓబుల్ రాజు పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. విద్యుత్ లైన్ ఏర్పాటు వల్ల రైతులకు చెందిన 80ఎకరాల భూమిలో 17 టవర్లు వస్తున్నాయని, మామిడి చెట్లు, టెంకాయ చెట్లు, సపోటా, అరటి వంటి ఫలాలు ఇచ్చే వందలాది చెట్లకు పరిహారం ఇవ్వకనే పనుల చేయడం దారుణమని నష్టపరిహారం చెల్లించిన తరువాత పనులు మొదలెట్టాలన్నారు. ముందుగా రైతు నోటీసులు ఇచ్చి మాట్లాడి ఒప్పించి పరిహారం ఇచ్చి పనులు ప్రారంభించకుండా దౌర్జన్యంగా రైతులను బెదిరించి పనులు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు రైతుల తరపున మాట్లాడి వారికి రావలసిన పరిహారాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే దౌర్జన్యంగా పనులు చేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఈ విషయమై సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి చర్చించారు. వారు స్పందించి మాట్లాడుతూ పరిహారాన్ని రైతులకు ఇచ్చి పనులు ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పామని తెలిపారు.

చెత్త కుప్పలు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్

కట్టమంచిలో కంపు కొడుతోంది.. వార్త, ఆహ్లాదానికి ఆమడ దూరం అని కట్టమంచి చెరువు కట్టమీద రాసిన వార్తలకు స్పందన లభించింది. గురువారం అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది కట్టమంచిలో చెత్తా చెదారాన్ని శుభ్రపరిచి చెత్త కుండి ఏర్పాటు చేశారు. అలాగే ఇంటి వద్దకు వచ్చి చెత్త సేకరణ చేపట్టారు. దీంతో పాటు కట్టమంచి చెరువు కట్ట పైన పూలకుండీలలో కలుపు మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. చెరువు కట్ట పైన ఉన్న పార్కులలో చెత్తాచెదారాన్ని, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.



785 టీఎంసీల నీరు కేటాయింపు

ఫలించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రయత్నాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. చిత్తూరు నగరానికి అడవిపల్లి రిజర్వాయర్ నుండి నీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అడవిపల్లె రిజర్వాయర్ నుండి చిత్తూరు నగరపాలక సంస్థ నీటి అవసరాల కోసం 0.785 టీఎంసీల నీటిని కేటాయిస్తూ, పలు మార్గదర్శకాలతో జీవోఆర్టీ 395ను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ జారీ చేశారు. చిత్తూరు నగర నీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన అడవిపల్లి రిజర్వాయర్ నుండి పైప్‌లైన్ ఏర్పాటు ప్రాజెక్టును గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ అడివిపల్లి పైప్‌లైన్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఎన్నికల సమయంలో త్తూరు నగర నీటి అవసరాలు తీరుస్తానని, అడవిపల్లి రిజర్వాయర్ పైప్ లైన్ ప్రాజెక్టును పూర్తి చేయించి నీటి సరఫరా చేస్తామని హామీ ఇస్తూ.. ఎన్నికలకు ముందే ప్రాజెక్ట్‌ను సందర్శించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రాజెక్టును మళ్ళీ పట్టాలెక్కించి పనులు వేగంగా జరిగేలా పబ్లిక్ హెల్త్, సాగు నీటిపారుదల, మున్సిపల్ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. నేషనల్ హైవే, రెవెన్యూ సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి సాంకేతిక ఇబ్బందులను తొలగించారు. రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించాలని నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి విన్నవించారు. బుధవారం శాసనసభలను ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా ఒకవైపు ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు వేగవంతంగా సాగుతుండగా.. మరోవైపు నీటి కేటాయింపులను ప్రభుత్వం పూర్తి చేసింది. దశాబ్దాలుగా చిత్తూరును వేధిస్తున్న నీటి సమస్యకు ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ముందుకు కదులుతున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఆటంకాలు అన్ని తొలగడంతో త్వరలోనే చిత్తూరుకు అడవిపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా అయ్యేందుకు మార్గం సుగమయింది. తక్కువ సమయంలోనే అడ్డంకులను తొలగించి, నీటి కేటాయింపులు, సరఫరా పనులు వేగవంతం చేయడంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చొరవను నగరవాసులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అడవిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న గురజాల జగన్‌మోహన్ (ఫైల్‌ఫోటో)

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మామిడి సాగులో అధిక దిగుబడులు సస్యరక్షణతోనే సాధ్యమని జిల్లా ఉద్యాన శాఖ అధికారి డాక్టర్ డి.మధుసూధనరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని సుద్దగుంట సమీపంలో ఉన్న శివాలయంలో మామిడి రైతులకు పూత దశ నుంచి కోత దశ వరకు చేపట్టాల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాశాఖ అధికారి మాట్లాడుతూ తేనెమంచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే బూడిద తెగులు, పండు ఈగ నివారణ గురించి వివరించారు. పక్వానికి వచ్చి కాయలను మాత్రమే దపాలుగా కోయడం వల్ల నాణ్యమైన కాయలతో దిగుబడి పెరుగుతుందని తెలిపారు. గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగును ప్రోత్సాహిస్తున్నారని, అదే విధంగా దేశవాళి, దిగుమతి రకాలకు రూ.20 వేల నుంచి రూ.29 వేల వరకు హెక్టార్‌కు రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తారని, పెద్ద రైతులకు 70శాతంతో డ్రిప్ పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో నాగేశ్వరరాజు, లోకనాధరెడ్డి, యువరాజు, ఉద్యానశాఖ అధికారి లోకేష్, బాలాజీ, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'సాగునీటి' ఎన్నికలపై శిక్షణ

ప్రజాశక్తి- విజయపురం: సాగునీరు సంఘ ఎన్నికలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నియమావళి, ఓటరు జాబితా, ఓటర్ల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ సాగునీటి సంఘ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని చిత్తూరు ఇరిగేషన్ ఈఈ మురళీకుమార్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణప్రకాష్, ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్, ఎంఈవో హరిప్రసాద్ శర్మ, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: సాగునీటి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీఈ జయ చంద్రబాబు కోరారు. గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సాగునీటి సంఘ ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈ సిబ్బందికి ఎన్నికల విధివిధానాలపై వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏఈ భాస్కర్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి- వి కోట: మండలంలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి సిఎం దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభించి అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను పూర్తిచేయాలని, ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం వాటికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు.

నేడు ప్రజా రవాణా సదస్సును

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 15వ తేదీ శుక్రవారం ప్రజారవాణా సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఏపీఎస్ఆర్టీసీకి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ఆర్టీసీ అభివృద్ధికి ప్రజలు సలహాలు సూచనలు అందజేయాలని కోరారు. ప్రజాభిప్రాయం మేరకు వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజల సలహాలు సూచనలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యఓఉలు చుక్క ధనుంజ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని పన్నూరు హరిశ్చంద్రాపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, టీడీపీ నాయకులు రైతులకు సబ్సీడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో రజినీ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద, సూపర్వైజర్లు కలసి స్వీట్లు, పండ్లు అందించడంతోపాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ వృద్ధులు ఆరోగ్యపట్ల జాగ్రత్తలు పాటించి నిత్యం ఆరోగ్యంగా ఉండాలన్నారు. షుగరు, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. సూపర్వైజర్లు ఇందిరా, శామిని, రాస్ కోర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

'యుక్తధారా పోర్టల్' శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- యాదమరి: రాష్ట్రస్థాయి యుక్తధారా పోర్టల్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఉపాధి హామీ చట్టం సంచాలకులు పీడీ రవికుమార్ ప్రారంభించారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనుల పారదర్శకత, నాణ్యత ప్రమాణాలు, సంస్కరణలలో యుక్తధార యాప్ ఎంతో కీలకంగా పనిచేస్తుందని, ఈ యాప్ సంబంధించి ఉపాధి సిబ్బందికి మూడు రోజులపాటు ఐరాల మండలంలో రాష్ట్రస్థాయి శిక్షణను సునీల్ (సీఆర్డి కార్యాలయం జీఐఎస్ నిపుణుడు) వారి బృందం నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాల జీఐఎస్ బృందాలు ఈకార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణకు వస్తున్న ఉపాధి హామీ అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏపీఓ సంధ్యారాణి ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఐరాల ఎంపిడిఓ ధనలక్ష్మి, ఏపీఓ సంధ్యారాణి, ఎమ్మెసీసీ సిబ్బంది, ఏపీడీ (సీబీ) సునీల్, డిడబ్ల్యుఎంఏ సూపరింటెండెంట్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా కోటా పెంచడంపై హర్షం

ప్రజాశక్తి- యాదమరి: కూటమి ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో భాగంగా క్రీడా కోటా రెండు నుంచి మూడు శాతం పెంచడంపై పిఆర్టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి సంతోషంగా హర్షం వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు చదువులలోపాటు క్రీడాలలో ముందుకెళ్లేందుకు ఎంతో మంచి అవకాశమన్నారు. జిల్లా మహిళ ఉపాధ్యక్షులు జె.హిమబిందు మాట్లాడుతూ వ్యాయమ ఉపాధ్యాయులు ఆత్మస్థైర్యంతో విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నారని అభిప్రాయపడ్డారు. మండల నాయకులు శివప్రసాద్, సురేష్ రెడ్డి, ఆనందపిళ్లై, తులసి ప్రసాద్, మోహన్ కుమార్, విశ్వనాధ్, కాంచన హరికృష్ణ, సుశీల, వెంకటరమణ, స్వర్ణలత పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఎంపీపీ

ప్రజాశక్తి- శాంతిపురం: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడ తాడేపల్లిలోని నివాసంలో కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ భరత్ పుట్టినరోజు సందర్భంగా సతీసమేతంగా వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్‌కు జగన్మోహన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు శాంతిపురం మండల ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, వైసీపీ నేత కోదండ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గురువారం డాక్టర్ ఆశ ఆధ్వర్యంలో కేన్సర్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈనెల 14 నుండి వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాల పైబడిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి 30 సంవత్సరాలు పైబడిన స్త్రీలకు కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడంతో ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకుంటే వ్యాధిని నివారించవచ్చునని తెలిపారు. ఇంటి వద్దకు వైద్య సిబ్బంది వచ్చినప్పుడు వారి వద్ద తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. వైద్య సబ్ యూనిట్ అధికారి జయశంకర్, వైద్య సిబ్బంది సుజాత, ఆశా వర్కర్ నాగమణి, కైరున్ పాల్గొన్నారు.

ఎంపిడిఓగా కెటి.బాలకృష్ణ

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం పరిపాలన అధికారిగా కెటి.బాలకృష్ణ గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం కుప్పం మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై గుడిపల్లి ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించారు.

బాల్యం ఓ మధుర జ్ఞాపకం

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


చౌడేపల్లి లో..


కార్వేటినగరంలో..

ప్రజాశక్తి- పుంగనూరు: బాల్యం ఎప్పటికీ తిరిగి రానిదని మరచిపోలేనిదని మధుర జ్ఞాపకం అని తెలుగుదేశం పార్టీ నాయకుడు సయ్యద్ సుహేల్ బాష అన్నారు. గురువారం స్థానిక ఉర్దూ స్కూల్లో ఘనంగా బాలుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండిత్ జవహర్లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలను జరుపుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఉర్దూ స్కూల్ హెడ్ మాస్టర్ మహ్మద్ నఖివుల్లా హజ్రత్ లైఫ్ టైమ్ అచివ్ మెంట్ అవార్డు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు చలపతి, గిరిబాబు, అబ్బాస్ అలి, అస్లాం, అన్ను సయ్యద్ పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలాల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వివిధ పోటీలల్లో విజేతలైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు విజయ చంద్రిక, రాధ కుమారి, వెంకటేశు, గోపి, వెంకమరాజు, విజయ కుమార్, విజయవర్మ, లక్ష్మీపతి పాల్గొన్నారు. ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాల పిల్లలకు రిటైర్డు ఉపాధ్యాయులు చంద్రయ్య విద్యా సామగ్రిని ఉపాధ్యాయులు వంశీకృష్ణ చేతులు మీదుగా అందించారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు

చౌడేపల్లి : బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నిరంజన్, శివ కేశవ, హేమావతి, సుమతి, లాస్య, ప్రియ, నిహారిక, అపర్ణలు జాతీయ, రాష్ట్ర స్థాయిలో కబడ్డీ, వాలీబాల్ ఆడి గెలుపొందడంతో వారిని ఘనంగా సన్మానించారు. ఎంఈఓ కేశవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, సుధాకర్, పిఈటి రాజేంద్ర బాబు పాల్గొన్నారు.

దర్శితశ్రీకి ఘనసత్కారం

గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థి దర్శితశ్రీని కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ లావణ్య గురువారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం కలిజవేడు పంచాయతీ కె.వెంకటాపురంకు చెందిన విద్యార్థిని దర్శితశ్రీ రూ.12.860లు వసూళు చేసి పాఠశాల యాజమాన్యానికి అందజేసిందని తెలిపారు. దీంతో బాలాల దినోత్సవం సందర్భంగా దర్శితశ్రీకి శాలువ కల్పి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు.

కార్వేటినగరం: నేటి బాలలే భావి భారత భాగ్యవిధాతలను డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఆర్కేవీబీపేట ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించి క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. అలాగే శ్రీలక్ష్మీనరసింహా పాఠశాలలోనూ బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

బాల క్రీడాకారులకు ఘనసన్మానం


కుప్పంలో..

కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానించారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మురళి, ఉపాధ్యాయులు తాజ్‌ఖాన్, రమేష్, మంజునాథ్ గుప్తా, మహేంద్ర సురేంద్ర బాబు, లోకనాథం, లీలాదేవి, మాధవి, గాయత్రి, శాంతిర్మయి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: భారతదేశ నిర్మాణానికి వెన్నెముక నేటి విద్యార్థులని తులసమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో నవంబర్ 14న నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

పలమనేరు: పలమనేరు బాలికోన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో న్యాయవాది ఎల్.భాస్కర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం బాలలకు కూడా హక్కులు ఉన్నాయని తెలిపారు. న్యాయవాదులు హరిపుల్లా ఖాన్, సయ్యద్ మొహిద్దిన్, బాలకోవుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా బాలల దినోత్సవం జరిగింది. డాక్టర్ శారద, డాక్టర్ యుగంధర్, డాక్టర్ మమతా రాణి ఆసుపత్రి ఆవరణలో కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్లారు.

సదుం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయ కుమార్ రెడ్డి వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వి.ధరణీధర్ అండ్ 14 విభాగంలో కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయిలో గెలుపొంది, జాతీయ జట్టుకు ఎంపికైన సందర్భంగా ధరణీధర్‌కు రూ.2500లు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పీడీ ఎస్.రెడ్డిప్రవీణ రూ.2000లు, పీడీ కిషోర్ కుమార్ రూ.5000లు విలువగల క్రీడా దుస్తులను అందజేవారు. తెలుగు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సదుంలో..

సిఆర్ రాజన్‌కు ఘనసన్మానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: వన్నెకుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సిఆర్.రాజన్‌ను నియమించడంతో మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, టిడిపి నాయకులు సిఆర్ రాజన్‌ను గజమాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మండల యాదవ సంఘం అధ్యక్షులు హేమాద్రి యాదవ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, శ్రీహరి రెడ్డి, జయచంద్రబాబు నాయుడు, మండల యువత అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ నోమేశ్వర్ రెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

డీఎస్పీగా విజయశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా విజయశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన డీఎస్పీల సాధారణ బదిలిలో భాగంగా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ చిత్తూరు జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

ఏవోగా కుమార్

ప్రజాశక్తి- గుడిపాల: గుడిపాల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏవోగా కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి లభించడంతో ఇక్కడే ఏవోగా ఎంపీడీవో శివరాజు మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యత స్వీకరించారు. ఏవోను ఎంపీడీవోతో పాటు సిబ్బంది శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. టిడిపి నాయకులు బాలాజీ నాయుడు, సాంబశివ నాయుడు, ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.

టిడిపి నేతలు సంబరాలు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ప్రభుత్వం విప్ పదవిని ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ఇవ్వడంపై మండలంలోని పలువురు టిడిపి నేతలు సంబరాలు చేసుకున్నారు. మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, పార్లమెంట్ టిఎన్ టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, నేతలు పాల్గొన్నారు.

మామిడి సాగుపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మామిడి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉద్యానవనశాఖ అధికారి వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పెద్దపంజాణి, గంగవరం మండలాల్లోని మామిడి రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో మామిడి తోటల్లో పూత పిందె సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యానఅధికారి, శాస్త్రవేత్తలు పాల్గొంటారని రైతులందరూ హాజరుకావాలని సూచించారు.

108 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- గుడిపాల: 108 సిబ్బంది న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు గణేష్, ప్రసాద్, స్థానిక తహశీల్దార్ హనుమంతు నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ 108 రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అరబిందో సంస్థ కాకుండా 108ని ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. వేతన స్లాబ్స్‌ని అప్డేట్ చేసి వేతనాలు పెంచాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వేతన స్లాప్స్ అప్డేట్ చేయలేదని, ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్స్, అరియర్స్, ఈయల్ నిధులు అరబిందో సంస్థ ఇవ్వలేదనీ వాటిని వెంటనే ఇవ్వాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల పనివిధానం రద్దుచేసి 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. రూ.20 లక్షల బీమా కల్పించాలని,



ఉద్యోగులకు చెందిన పిఎఫ్ అమౌంటు యాజమాన్య వాటా కూడా ఉద్యోగుల దగ్గర నుంచి కట్ చేస్తున్నారని దానిని యాజమాన్యం నుంచి వసూలు చేయాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే ఈనెల 25 నుంచి సమ్మెకు దిగతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 71వ సహకార దినోత్సవం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 72వ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా సహకార బ్యాంకు ఎదుట ఏడు రంగుల సహకార జెండాను జిల్లా సహకార అధికారిని నాగవర్ధని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార స్ఫూర్తిని చాటుతూ రైతులు స్వయం సహాయక సహాయక సంఘాల మహిళలతో పాటు ఆర్థిక సహాయాన్ని కోరే వ్యక్తులకు బ్యాంకు నుండి రుణాలను అందజేయాలన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధికారులు సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిత్తూరు సహకార బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు పెద్ద ఎత్తున సహకార వారోత్సవాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు బ్యాంకు ద్వారా అందించే సేవలను ఆధునికరిస్తున్నట్లు తెలిపారు. ఆడిటర్ బ్రహ్మానంద రెడ్డి, సహకార సంస్థ అధికారి వనజ, బ్యాంకు ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి: ఎంపీపీ రెడ్డప్ప

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అర్హులైన ప్రజలకు అందించే సంక్షేమ పథకాల అమలులో సచివాలయ ఉద్యోగస్తులు సమన్వయంతో అలసత్వం లేకుండా అర్హులైన వారికి అందించాలని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో మండలంలోని సచివాలయం ఉద్యోగస్తులతో ఎంపీపీ రెడ్డప్ప అధ్యక్షతన ఎంపీడీవో బాలాజీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకొని అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం కోసం చొరవ చూపాలని అన్నారు. సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో అన్నిరకాల సర్వేలను పూర్తిచేయడంలో సచివాలయ సిబ్బంది



సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో బాలాజీ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పరిపాలన అధికారి భాస్కర్, ఇంచార్జ్ హౌసింగ్ ఇంజనీర్ బాలచంద్ర, సిబ్బంది గణేష్, అఖిల పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు..


పూతలపట్టులో..

ప్రజాశక్తి- పూతలపట్టు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పూతలపట్టు గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాసల మణి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. బాలల దినోత్సవ సందర్భంగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి విద్యార్థులు చేత 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి కోట: స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాలు పుస్తకభాండాగారాలని వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఏఎన్.సుబ్రమణ్యం, కె.రామచంద్రయ్య అన్నారు. వారు మాట్లాడుతూ నేటి తరం యువత ఎక్కువగా మొబైల్ ఫోన్లకు బానిసలు అవుతున్నారని, ఫోన్ విడిచి పుస్తకాలు చేతపట్టినప్పుడే విజ్ఞానం పెరుగుతుందని అన్నారు.

బంగారుపాళ్యం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వరహించారు. ఈ సందర్భంగా మండల ఎంఈఓ 1, 2 నాగేశ్వరరావు, రమేష్ బాబు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జరుగుతాయిని, వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు ధనంజయరాజు, సుశీల, రామకృష్ణ పాల్గొన్నారు.


వి కోట లో..


బంగారుపాళ్యంలో..

కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని గ్రంథాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు గ్రంథాలయ వారోత్సవాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కడా పిడి వికాస్ మరమత్ పాల్గొని పిల్లలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రైం న్యూస్

రెండు లారీలు ఢీ

ఇరువురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- గుడిపాల: ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న ఘటన చిత్తూరు మండల పరిధిలోని గోపాలపురం వద్ద గురువారం వేకువ జామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నై నుంచి బెంగళూరుకు, బెంగళూరు నుండి చెన్నైకు వెళ్తున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో లారీ డ్రైవర్లు బాలకృష్ణనన్ (27), రాజేష్ కుమార్ (35) ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు లారీలు ఇరుక్కుపోవడంతో గంటసేపు జేసీబీ, క్రేన్ల సాయంతో విడదీయడంతో వారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. 108 సిబ్బంది శివ,బాబీ సమయస్ఫూర్తితో లారీ క్యాబిల్ పైనే అత్యవసర వైద్యం ఇచ్చి రక్తస్రావాన్ని ఆపి డ్రైవర్ల ప్రాణాలను కాపాడారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో దాదాపు రెండు గంటలసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీనిపై చిత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 మందికి రూ.2. 70లక్షల జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు బుధవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 27మంది పట్టుబడ్డారు. వీరిని గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు 27మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.2,70,000లు జరిమానా విధించడం జరిగింది. ఈ 11 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 518 మందికి సుమారు రూ.51.9 లక్షల ఫైన్ విధించడం జరిగిందని నిత్యాబాబు తెలిపారు.

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తమిళనాడు సరిహద్దు గ్రామాల సమీపంలోని చెరకు తోటలు, అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన గోపిశెట్టిపల్లి, కొటార్వేడు పరిసర ప్రాంతాల్లో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. కొటార్వేడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచార మేరకు దాడులు నిర్వహించగా అక్కడున్న వ్యక్తి పరారీ అయినట్లు తెలిపారు. దీంతో సారా తయారు చేసే పరికరాలతో పాటు, 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారని అలాగే అమ్మకానికి సిద్ధం చేసిన 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సారా తయారు చేస్తు పరారీ అయిన వ్యక్తిని గుర్తించి త్వరలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

ఆర్థిక లావాదేవీల ఘర్షణ

కేసు నమోదు

ప్రజాశక్తి- పుంగనూరు: ఆర్థిక లావాదేవీల కారణంగా ఇరు వర్గాలు ఘర్షణపడి గాయాలపాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గూడూరుపల్లి గ్రామానికి చెందిన బి.గంగాధర్ కుమారుడు బి.నాగరాజు, బాలసుబ్రమణ్యం, పుంగనూరు పట్టణానికి చెందిన మల్లికార్జున్, కొండ సముద్రంకు చెందిన శశికుమార్‌ల మధ్య ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో చెల్లించాల్సిన డబ్బులు సరిగా ఇవ్వడం లేదంటూ ఘర్షణ జరిగింది. బాలసుబ్రమణ్యం, మల్లికార్జున, శశి కుమార్ కలిసి బి.నాగరాజుపై దాడిచేసి గాయపరిచారు. దాడిలో నాగరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో నాగరాజు తండ్రి మీడియాతో మాట్లాడుతూ ఇదేవిధంగా గతంలో పలుమార్లు దాడి చేసి గాయపరచడం జరిగిందని, తన కొడుకుపై కక్ష గట్టి ఉద్దేశపూర్వకంగా పథకం ప్రకారం హత్య చేయడానికి ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆ ముగ్గురి వలన తన కుమారుడికి ప్రాణహాని ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్టు చేయాలని కోరారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని వెలుతురుచేను పంచాయతీ పులిమడుగు గ్రామానికి చెందిన రైతు స్వామినాథన్‌కు చెందిన పాడి పిడుగు పడి మృతిచెందింది. గురువారం కురిసిన వర్షానికి పిడుగు పడి పాడి ఆవు మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. విషయం తహశీల్దార్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి తహశీల్దార్ సంబంధిత పశువైద్యాధికారికి సమాచారం అందించి నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపి రైతును ఆదుకోవాలని తెలిపారు.

టిడిపి నేతకు నివాళి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఉమాచలపతిరెడ్డి బుధవారం మరణించారు. గురువారం జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, టిడిపి నేతలతో కలిసి ఉమాచలపతిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట నాగిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పట్టాభి ఉన్నారు.